జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ **వార్త** తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ **వార్త** తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ **వార్త** తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

బుధవారం | 16-7-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 397 పేజీలు: 4 వెల : రూ.7



* జలుమూరు తహసీల్దార్‌కు ప్రభుత్వ గట్టిపోటు! * నిర్లక్ష్యంపై ఆర్.టి 730 పేరుతో విచారణ
* 2023 సంఘటనలపై ఏసీబీ కేసు
* తవ్వుతున్న కొద్ది బయటపడిన అక్రమాలు
* 'మీసేవా - అప్లికేషన్లకు బ్రేక్.. అధికారులపై విచారణకు డ్రైవ్'

## ఆ.. అధికారుల తీరు..

# రెవెన్యూ వ్యవస్థకే మచ్చ

**శ్రీకాకుళం, జూలై 16 (వార్త):** ప్రజల కష్టాలను పట్టించుకోకుండా, వారి అవసరాలను కాలదన్నుతున్న అధికారులపై ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. మొన్న కొత్తూరు తహసీల్దార్‌పై విరుచుకుపడిన ప్రభుత్వం తాజాగా జలుమూరు రెవెన్యూ కార్యాలయంలో అవకతవకలపై స్పందించింది. జలుమూరు తహసీల్దార్ వ్యవహరించిన తీరుపై ప్రభుత్వానికి 14400 ఫిర్యాదుల రూపంలో సమాచారం వెళ్ళింది. ఈ ఫిర్యాదుల నేపథ్యంలో 2023 ఏప్రిల్ 26న ఏసీబీ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించగా, దిగ్భ్రాంతికరమైన నిజాలు వెలుగులోకి వచ్చాయి. అధికారిక విధుల్లో తీవ్రమైన నిర్లక్ష్యం, ప్రజలతో అమర్యాదగా వ్యవహరించినందుకు తహసీల్దార్‌పై ప్రభుత్వం డివిజనల్ విచారణకు ఆదేశాలు జారీ చేసింది. జీవో నెం. ఆర్టీ 730 తేది 16.07.2025 ద్వారా ఈ విచారణ మొదలుపెట్టారు. ప్రజల దరఖాస్తులను దురుద్దేశపూర్వకంగా ఆలస్యం చేసి, ప్రభుత్వ ప్రతిష్టకు భంగం కలిగించినందుకు తహసీల్దార్, మరో ఇద్దరిపై కఠిన చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధమైంది.

### డీటీ పొన్నాడ శ్రీనివాసరావు కీలకం..

జలుమూరు తహసీల్దార్ కార్యాలయంలో నిర్లక్ష్యానికి కళ్లెం వేయకపోవడంలో కేవలం తహసీల్దార్ ఒక్కరే కాదు, ఇతర సంబంధిత అధికారులు కూడా పాత్ర పోషించినట్లు ఏసీబీ తనిఖీల్లో స్పష్టమైంది. డిప్యూటీ తహసీల్దార్ పొన్నాడ శ్రీనివాసరావు తనిఖీల్లో ఎదురైన కీలక అంశాలలో ఒకటైన బిల్లుల రిజిస్టర్లు, వీఆర్ఓ జీతాల లెక్కల ఆధునీకరణపై పూర్తిగా నిర్లక్ష్యం వహించినట్టు నిర్ధారణ అయింది. ఆయన బాధ్యతలో ఉండాల్సిన ప్రాథమిక పత్రాలు 2022 డిసెంబరుతోనే నిలిచిపోయి, అప్పటి నుంచి నవీకరణ జరగకపోవడం తీవ్ర విఫలతగా కనిపించింది.

### ఆర్ఐ బలివాడ సతీష్ కుమార్ మామూలోడు కాదు..

అదే విధంగా మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బలివాడ సతీష్ కుమార్ పట్ల కూడా విమర్శలు వెల్లువెత్తాయి. ఓ మహిళ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసిన తర్వాత, మూడు రోజులలోపు స్పందించాల్సినపుడు అనవసర ఆలస్యం చేసి ప్రజలకు అన్యాయం చేసినట్టు ఏసీబీ ఆధారాలు పేర్కొన్నాయి. సబ్-స్లా కాలానికి అతీతంగా అప్లికేషన్లు నిలిపివేసిన తీరును అధికార నిర్లక్ష్యంగా పరిగణించారు.

### వేళ్ళన్నీ తహసీల్దార్ బంకుపల్లి సత్యం వైపే..

ఇక తహసీల్దార్ బంకుపల్లి సత్యం వ్యవహారమే ఈ వ్యవహారానికి కేంద్రబిందువుగా మారింది. అధికారిక బాధ్యతల పట్ల నిర్లక్ష్యం, అప్లికేషన్లను దురుద్దేశపూరితంగా తిరస్కరించడం, ప్రజలకు న్యాయం జరగకుండా వ్యవస్థను అడ్డుకుంటున్నట్లు ఆరోపణలు వచ్చాయి. మొత్తం 265 అప్లికేషన్లు సర్వీస్ కాలం మించి తిరస్కరించబడటం, 24 మీసేవా దరఖాస్తులు ఇప్పటికీ పెండింగ్‌లో ఉండటం వల్ల, ఆయనపై విభాగీయ విచారణకు ఇన్నాళ్లకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

### వీఏస్డబ్ల్యూఎస్, మీసేవా సేవలపై బీభత్సం..

తహసీల్దార్‌గా 2022 జూలై 2న బాధ్యతలు స్వీకరించిన బంకుపల్లి సత్యం, 2023 ఏప్రిల్ 26 వరకు తన కార్యకలాపాలను నిర్వహించారు. ఈ సమయంలో వీఏస్డబ్ల్యూఎస్ ద్వారా వచ్చిన 29,743 దరఖాస్తులలో 265 దరఖాస్తులను నిర్దేశిత కాలవ్యవధి దాటిన తర్వాత తిరస్కరించారు. 2,602 మీసేవా దరఖాస్తులలో 24 దరఖాస్తులను ఇప్పటికీ పెండింగ్‌లో ఉంచినట్లు ఏసీబీ నివేదిక స్పష్టం చేసింది. దీంతో ప్రజలు నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడింది. అంతేకాకుండా, కొంతమంది మధ్యవర్తుల ద్వారా డబ్బులు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి.

### సూక్ష్మ విచారణలో సంక్షిప్త విశ్లేషణ..

2023 ఏప్రిల్ 26న రాత్రి 11:55 గంటల వరకు కొనసాగిన ఏసీబీ తనిఖీలలో మూడు కీలక అంశాలు బయటపడ్డాయి. 265 దరఖాస్తులను ఆలస్యం చేసి తిరస్కరించడం, 24 మీసేవా దరఖాస్తులు ఇంకా పెండింగ్‌లో ఉంచడం. వారసత్వ ధ్రువీకరణ, ఆదాయ ధ్రువపత్రాలు, పాస్‌బుక్ మార్పులు వంటి కీలక సేవలను నిర్లక్ష్యం చేయడం, ఒక మహిళ కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేస్తే, దానికి ఐదు రోజుల తర్వాత మాత్రమే స్పందించినట్లు ఏసీబీ నివేదికలో పేర్కొన్నారు.

### విచారణకు సాక్షాలు, ఆధారాలూ సిద్ధం

ఈ విచారణలో మధ్యవర్తులుగా వ్యవహరించిన ఇద్దరు వెటర్నరీ సహాయకుల వాంగ్మూలాలు, రెవెన్యూ డివిజనల్ అధికారి ఇచ్చిన నివేదిక, తహసీల్దార్ కార్యాలయం నుంచి స్వాధీనం చేసుకున్న దరఖాస్తుల ప్రతులు, కంప్యూటర్ ఆపరేటర్ తీసిన ప్రింటవుట్ల ఫైళ్లు ప్రధాన ఆధారాలుగా ఉన్నాయి. వీటి ఆధారంగా తహసీల్దార్ పాలనలో తీవ్రమైన లోపాలు ఉన్నట్లు ప్రభుత్వం నిర్ధారించింది.

### నిబంధనల ఉల్లంఘన.. శిక్ష తప్పదా?

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగ నియమావళి 1964 ప్రకారం విధి నిర్వహణలో నిబద్ధత లేకపోవడం, పారదర్శకత లోపం, సేవల్లో జాప్యం చేసి ప్రజలకు ఇబ్బందులు కలిగించడం, ప్రభుత్వ ప్రతిష్టకు భంగం కలిగించడం. ఈ నిబంధనలను తహసీల్దార్ ఉల్లంఘించినట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అభిప్రాయపడ్డారు. అతడిపై రూల్ 20 కింద విచారణ జరిపించనున్నారు. ఈ ఆరోపణలు రుజువైతే పదోన్నతుల రద్దుతోపాటు ఇతర కఠిన క్రమశిక్షణ చర్యలు ఎదురయ్యే అవకాశం ఉంది.

### సహకరించిన అధికారులపైనా నిఘా..

ఈ నిర్లక్ష్యంలో కేవలం తహసీల్దార్ ఒక్కరే కాకుండా, ఇతర సంబంధిత అధికారులు కూడా భాగస్వాములయ్యారని ఏసీబీ తనిఖీల్లో వెల్లడైంది. డిప్యూటీ తహసీల్దార్ పొన్నాడ శ్రీనివాసరావు బిల్లుల రిజిస్టర్లు, వీఆర్ఓ జీతాల లెక్కలను 2022 డిసెంబరు నుంచి నవీకరించకుండా నిర్లక్ష్యం వహించారు. అదేవిధంగా మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బాలివాడ సతీష్ కుమార్ ఒక మహిళ కుటుంబ ధ్రువీకరణ పత్రం దరఖాస్తును అనవసరంగా ఆలస్యం చేసి ప్రజలకు అన్యాయం చేసినట్లు ఆధారాలు బయటపడ్డాయి. వీరిపైనా అధికారులు దృష్టి పెట్టే అవకాశం ఉంది. ప్రజల సేవల కోసం ఏర్పడిన వ్యవస్థలు ప్రజలనే ఇబ్బందులకు గురిచేస్తే, పాలనపై విశ్వాసం దెబ్బతింటుంది. తహసీల్దార్ నిర్లక్ష్యం ప్రభుత్వ ప్రతిష్టకే మచ్చ తెచ్చింది. మరి ఈ వ్యవహారంలో దోషులపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి.



### కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్ వద్ద

## మాజీ మంత్రి సీదిరి బైఠాయింపు

* పోలీసులకు వ్యతిరేకంగా వైసీపీ నేతలు నినాదాలు * సీదిరితో వాగ్వాదానికి దిగిన సీఐలు

**పలాస, జూలై 16 (వార్త):** కాశీబుగ్గ: కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ వద్ద బుధవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసుల తీరును నిరసిస్తూ మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు స్టేషన్ ఎదుటే వైసీపీ నాయకులతో కలిసి ధర్నా చేశారు. చినబాడాం గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన ఘర్షణలో సంబంధం లేని వ్యక్తులు కౌన్సిలర్ ప్రతినిధి దువ్వాడ రమణయ్య, సుబ్బారావు, మరి కొంతమంది వ్యక్తులను అధికార పార్టీ ఒత్తిడి మేరకు అన్యాయంగా పోలీసులు అరెస్టు చేశారని ఆరోపిస్తూ స్టేషన్ వద్ద బుధవారం మాజీ మంత్రి ధర్నా చేశారు. బాధిత కుటుంబ సభ్యులు, వైసీపీ నాయకులతో కలిసి కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ, పోలీసులను నిలదీశారు. 7వ వార్డు చినబడాం కౌన్సిలర్ దువ్వాడ సత్యవతి భర్త రమణయ్యతో పాటు మరో ఇద్దరు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. గాయపడిన టీడీపీ కార్యకర్తలు ఫిర్యాదు చేయడంతో ముగ్గురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని పోలీసులు సర్దిచెప్పే ప్రయత్నం చేయడంతో అప్పలరాజుకు పోలీసులకు మధ్య వాగ్వాదం చోటుచేసు కుంది. తమ విధులకు ఆటంకం కలిగించవద్దని సీఐ పి.సూర్యనారాయణ, రూరల్ సీఐ తిరుపతిరావు కోరడంతో అప్పలరాజు బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని లేకపోతే మళ్లీ వచ్చి ధర్నా చేస్తానని హెచ్చరించి వెనుదిరిగారు. ఈ కార్యక్రమంలో బత్తిన హేమేశ్వరరావు, సిస్టు గోపి, బోర బుజ్జి, పిచ్చుక అజయ్, ప్రసాద్ రెడ్డి, సవర సోమేశ్వరరావు, గౌరీత్యాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

# 18న విద్యుత్ సరఫరాకు అంతరాయం

**మందస, జులై 16(వార్త):** మందస మండలంలోని హరిపురం సబ్ స్టేషన్ పరిధిలో ఈనెల 18న విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.యగ్నేశ్వరరావు, మందస ఏఈ ఎల్.యోగి చెప్పారు. 132/33కేవీ పలాస ఈహెచ్ టీ సబ్ స్టేషన్ లో నిర్వహణ పనుల దృష్టా హరిపురం సబ్ స్టేషన్ పరిధిలో ఉండే అన్ని గ్రామాలు హరిపురం, అంబుగాం, మధ్య, పిడిమందస, వీరగున్నమ్మపురం, కుంటికోట, వాసుదేవపురం, కమలాపురం, బిడిమి, నల్లబొడ్డులూరు, గంగువాడ, బహడపల్లి, సరియాపల్లి, నారాయణపురం తదితర గ్రామాల్లో ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.యగ్నేశ్వరరావు, మందస ఏఈ ఎల్.యోగి కోరారు.

# వంశధార సాగు జలాలను అందివ్వాలి





**మందస, జులై 16(వార్త):** వంశధార జలాలను పలాస నియోజకవర్గంలోని ప్రతి ఎకరానికి అందివ్వాలని కోరుతూ వంశధార సాగు జలాలు సాధన కమిటీ నాయకులు పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల శాసనసభ సభ్యులు గౌతు శిరీష, బెందాలం అశోక్ లకు వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్బంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ వంశధార సాగునీటి జలాలు ఇచ్ఛాపురం వరకు అందిస్తామని ఎన్నికలకు ముందు నాయకుల వాగ్దానాలు చేసి ఎన్నికలు అయ్యాక పట్టించుకోవడం లేదన్నారు. ఈ వ్యవహారం సుమారుగా 40సంవత్సరాల నుండి కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వంశధార ప్రాజెక్టుకు సమస్యగా ఉన్న నేరేడు బ్యారేజ్ అంశం ఒడిస్సారాష్ట్ర సమస్యమని, ఈ విషయం ప్రభుత్వానికి పెద్ద సమస్య ఏమీకాదని, కానీ పరిష్కారం చేయలేని పరిస్థితిలో ప్రభుత్వాలు ఉన్నాయంటే రైతుల పట్ల ఎంత నిర్లిప్తతతో వ్యవహారిస్తున్నాయని అర్థం చేసుకోవచ్చని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీకాకుళం జిల్లా మొత్తానికి మూడు పంటలు పండించే అవకాశ మున్నప్పటికీ జల సంపద కలిగిన మహాఘనిని సముద్రము పాలు చేస్తున్నారన్నారు. రైతుల పంటలు పండితే దేశ సంపద (జీడీపీ) పెరుగుతుందని, దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. రైతులు ఆదాయము పెరిగితే అన్ని రంగాలు అభివృద్ధి చెందుతాయన్న విషయాలు తెలిసి కూడా రైతు పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని, రైతులు పాలకుల నిర్లక్ష్యంపై ప్రశ్నించిన నాడే దేశం సౌభాగ్యవంతమవుతుందని అన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మార్పు మన్మధరావు, ఉపాధ్యక్షుడు ధర్మార్పు వెంకటరావు, కొర్ల హేమారావుచౌదరి, నల్ల హడ్డి, గుంటు లోకనాథం, శశిధర్ వర్మ, దుంపల వైకుంఠరావు, ఉగ్రిపల్లి సోమనాదం, కొవ్వూరు దశరధి, దేవాడ నారాయణరావు, వాయలపల్లి పాపారావు, వాయలపల్లి రమణ, కొర్నాన గంగాధర్, నర్సింగ నాథ్ సాబుతో, వెదుళ్ళ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

# పాతపట్నం అభివృద్ధికి సహకరించండి

**-మంత్రి లోకేష్‌కు ఎమ్మెల్యే ఎంజీఆర్ వినతి**



**కొత్తూరు, జులై 16(వార్త):** పాతపట్నం ఎమ్మెల్యే మరియు అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీ సభ్యులు మామిడి గోవింద్ రావు (ఎంజీఆర్) మంగళవారం ఉదయం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను విజయవాడ సమీపంలోని ఉండవల్లిలో కలిశారు. నియోజకవర్గంలోని ముఖ్య నాయకులతో కలిసి ఆయన ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గాభివృద్ధికి సంబంధించిన అనేక కీలక అంశాలను మంత్రి దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్లారు. ముఖ్యంగా బీసీ, సాంఘిక సంక్షేమ వసతి గృహాల మంజూరు, పాలిటెక్నిక్ కళాశాల స్థాపన తదితర అభ్యర్థనలపై మంత్రి స్పందించాల్సిన అవసరాన్ని ఆయన వివరించారు. వినతులను గమనించిన మంత్రి లోకేష్, సంబంధిత అంశాలపై త్వరితగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నియోజకవర్గ అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వానికి ప్రాధాన్యమన్నదే ఆయన అభిప్రాయం. ఈ భేటీ అనంతరం పాతపట్నం ప్రాంతంలో అభివృద్ధి పనులకు వేగం చేకూరనుందన్న నమ్మకాన్ని ఎమ్మెల్యే ఎంజీఆర్ వ్యక్తం చేశారు. కొత్తూరు మండల అధ్యక్షుడు అగతముడి మాధవరావు, కొత్తూరు పిఎసిఎస్ అధ్యక్షుడు మాతల గాంధీ, అగతముడి అరుణ్ కుమార్, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

# కాలువ నిర్మాణానికి రూ.26 లక్షలు మంజూరు

## ఏపీ వ్యవసాయ, కార్మిక సంఘం హర్షం

**కొత్తూరు, జులై 16(వార్త):** అలికాం- బత్తిలి ప్రధాన రహదారిపై కొత్తూరు - పారాపురం మధ్య మురికికాలువ (కల్వర్టు) నిర్మాణం కోసం గత రెండేళ్లుగా సాగిన ఉద్యమం ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.26 లక్షలు మంజూరు చేసి నిర్మాణ పనులను ప్రారంభించడం పట్ల ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీ సిర్ల ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉద్యమ దశలలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సంఘం చేసిన పోరాటం వల్లే ఈ విజయమని తెలిపారు. అప్పటి ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులకు కూడా తాము ధైర్యంగా ఎదుర్కొని ప్రజా ప్రయోజనాల కోసం నిలబడ్డామని చెప్పారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కల్వర్టు నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని, మూసివేసిన ప్రభుత్వ ఖనాను తక్షణమే తెరవాలని ఆయన డిమాండ్ చేశారు. ఉద్యమంలో సహకరించిన ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే గత ప్రభుత్వ హయాంలో నమోదు చేసిన అక్రమ కేసులను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో అఖిల భారత లాయర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. అప్పారావు, పైడి యతిరాజు, వైశ్యరాజు ప్రసాద్, శ్రీనివాసరావు, ప్రమీళ, నిమ్మక అప్పన్న, రాఘవరాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.





## కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పరుగులు

**ఇచ్ఛాపురం, జులై 16(వార్త):** కూటమి ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. మండపల్లి పంచాయతీ లో సుపరిపాలన లో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఐదు ఏళ్లలో జరగని అభివృద్ధి ఏడాది లో చేశామని మండపల్లి అభివృద్ధి కి కట్టుబడి ఉన్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు లోపింటి పద్మనాభం,పేదిని బాబ్జి, మెరుగు సూర్యనారాయణ,దుపాన సూర్యనారాయణ,కాళ్ల గోపి, పాతిర్ల చంద్రశేఖర్ రెడ్డి, సాడి సహదేవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మాజీ ఎంపిపి దక్కత ఢిల్లీ రావు జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు.


## రసాయన ఎరువుల షాప్ తనిఖీ



**ఇచ్ఛాపురం, జులై 16(వార్త):** వ్యవసాయ శాఖ ఏ డి టి భవానీ శంకర రావు, ఏవో అజయ్‌కుమార్ స్థానిక బజార్ రోడ్డులో రసాయన ఎరువుల విక్రయ దుకాణం ను అకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు అంశాలను పరిగణలోకి తీసుకొని సూచనలు అందజేశారు. రైతులకు ఇచ్చిన బిల్లులు పూర్తిగా ఇవ్వాలని, నిల్వలో ఉన్న ఎరువుల నాణ్యతను నిర్ధారించాలని, నిల్వ రిజిస్టర్, విక్రయ రిజిస్టర్ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని,. ధరలు బోర్డు పై ప్రదర్శించాలని అన్నారు. మిగులు నిల్వలు మరియు డెలివరీ వివరాలు సమగ్రంగా నిర్వహించాలని, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు విక్రయించాలని, రైతులకు సరైన మార్గనిర్దేశనం ఇవ్వాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీ సందర్బంగా వ్యాపారి కాదా వెంకట రమణ తగిన విధంగా ఎరువుల సరఫరాలో నాణ్యత మరియు పారదర్శకత పాటించాలని అధికారులు స్పష్టం చేశారు.

## మధ్యవర్తిత్వం - దేశం కోసంపై శిక్షణ

**పలాస, జులై 16(వార్త):** దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశం మేరకు బుధవారం మధ్యవర్తిత్వం - దేశం కోసం అనే అంశంపై పలాస మండల న్యాయ సంఘం, జూనియర్ సివిల్ జడ్జి యూ. మాధురి అధ్యక్షతన న్యాయవాదులు, పోలీసులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులతో కలిసి పలాస జూనియర్ జడ్జి కోర్టు నుంచి ప్రత్యేక ర్యాలీ నిర్వహించి ప్రజలకు మధ్యవర్తిత్వంపై కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ కోర్టులో పెండింగ్లో ఉన్న కేసులలో మధ్యవర్తిత్వం నిర్వహించుకుని చర్చల ద్వారా ఆ సమస్యకు 90 రోజులలో పరిష్కరించుకొని ఉపసంహానం పొందొచ్చు అని జూనియర్ సివిల్ జడ్జ్ తెలియజేశారు. అంతేకాకుండా మన పలాస కోర్టులో న్యాయవాదుల్లో కొంతమంది జిల్లా కోర్టులో ట్రైనింగ్ అయినవారు ఉన్నారని, మధ్యవర్తిత్వం నిర్వహించుకోవడం పై ఆసక్తి ఉన్నవారు ట్రైనీ లాయర్ల ద్వారా ఈ కేసుల నుండి త్వరగా కేసులు పరిష్కారం అయ్యేటట్టు చర్యలు చేపడతారని, అంతే కాకుండా దీనిని ఒక మాధ్యమంగా వినియోగించుకోవచ్చునని తెలియజేశారు. కోర్టు ఆవరణలో కూడా మధ్యవర్తిత్వం కొరకు ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేసి శిక్షణ పొంది న్యాయవాదం ద్వారా కేసులు పరిష్కరించుకోవచ్చని జూనియర్ సివిల్ జడ్జి యు మాధురి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఫయాజ్ అహ్మద్ గని, ఉపాధ్యక్షులు బి కేర్ పట్నాయక్, జాయింట్ సెక్రెటరీ జి ఎం ఎస్ అనిల్ రాజ్, తాండ్ర మురళీమోహన్, ఏజీపీ పిండి వెంకట్రావు, ఎన్ విశ్వేశ్వరరావు, కోత రజిని కుమార్, జి ప్రభాకర్ రావు, ఎల్ చంద్రశేఖర రావు, కే దేవరాజు, బి రవికుమార్ చిట్టిబాబు, వి రవి, డి మోహన్ రావు, లోకేశ్వరరావు, శ్రీనివాస్ రావు, వలంటీర్ సునీల్ కుమార్, కోర్టు సూపరిడెంట్ కే కృష్ణ, కానిస్టేబుల్ కోటి, కోర్టు సిబ్బంది, కక్షిదారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# సమావేశానికి వైసీపీ శ్రేణులు తరలిరావాలి



**సరుబుజ్జిలి, జులై 16(వార్త):** సరుబుజ్జిలి మండల ఎంపీపీ, జడ్పీటీసీ, వైస్ ఎంపీపీ లు, మండల పార్టీ ఉపాధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు, సర్పంచ్ లు, ఎంపీటీసీ లు, నియోజకవర్గ, మండల కమిటీ సభ్యులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, జగనన్న అభిమానులు గురువారం సాయంత్రం 4గంటలకు సరుబుజ్జిలి జంక్షన్ శ్రీ పడాల పాపారావు కల్యాణమండపంలో జరిగే “బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ” కార్యక్రమానికి తరలిరావాలని మండల వైసీపీ అధ్యక్షుడు బెవర మల్లేశ్వరరావు కోరారు.

మండల కార్యవర్గం ప్రమాణస్వీకారం, సన్మాన కార్యక్రమం కూడా జరుగుతాయన్నారు.



## పార్టీ నమ్ముకున్న వారికి పదవులు

**పలాస, జులై 16(వార్త):** తెలుగుదేశం పార్టీను నమ్ముకంటే యే స్థాయికి గౌతు కుటుంబం తీసుకొని వెళ్తారో అని చెప్పడానికి పలాస పిఏసిఎస్ పదవులు నిదర్శనం. మొదట నుండి పార్టీ కు గౌతు కుటుంబంనకు విధేయులుగా ఉన్నటివంటి లొద్దభద్ర గ్రామ వాస్తవ్యులు మాజీ సర్పంచ్ ప్రతినిధి వంకల కూర్మారావుకి పలాస పిఏసిఎస్ చైర్మన్ పదవి వరించిగా పిఏసిఎస్ డైరెక్టర్లుగా బొడ్డపాడు గ్రామ పంచాయతీ సీనియర్ నాయకులు, పార్టీ ప్రెసిడెంట్ బొడ్డు దుష్యంత్, బ్రాహ్మణ తర్లా మేజర్ పంచాయతీ సీనియర్ నాయకులు సుధాకర్ ను డైరెక్టర్లుగా పదవులు బుధవారం ఆదేశాలు అందాయి. ఈ సందర్భంగా చైర్మన్, డైరెక్టర్లను పలాస నియోజకవర్గ శాసన సభ్యురాలు గౌతు శిరీష దుశ్శలువాతో సత్కరించి వారికి ధ్రువీకరణ పత్రం అందించారు. పలాస నియోజకవర్గ సమన్వయ కర్త వెంకన్న చౌదరి పదవులను అధిరోహించిన వారికి హృదయ పూర్వక అభినందనలు తెలియజేశారు. పలాస మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు అందరూ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్, పార్టీ మండలం అధ్యక్షులు కుత్తు%శీ% లక్ష్మణ్ కుమార్, మాజీ అధ్యక్షులు తమ్మినేని గంగారాం, మున్సిపాలిటీ నాయకులు లొడగల కామేష్, ఎఎంసి చైర్మన్ మల్లా శ్రీను, గాలి కృష్ణారావు, మందస మండలం సీనియర్ నాయకులు దాసరి తాతారావు, క్లస్టర్ -3 ఇంచార్జి డల్లి ప్రసాద్, క్లస్టర్ -4 ఇంచార్జి మురుపింటి కుమార్ రాజ్, యూనిట్ ఇంచార్జిలు బొగానా దశరదరావు, కుత్తు ప్రకాష్, మురుపాలా నాగయ్య, యర్రా వెంకట్, బొడ్డపాడు గ్రామ పంచాయతీ టీడీపీ నాయకులు కిక్కర ఢిల్లీరావు తదితరులు పాల్గొన్నారు.

## పలాస అభివృద్ధికి మాస్టర్ ప్లాన్



**పలాస, జులై 16(వార్త):** రాబోయే 20 ఏళ్ళ అభివృద్ధి చేయుటకు పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం మాస్టర్ ప్లాన్ డ్రాఫ్ట్ గురించి శాసనసభ్యులు గౌతు శిరీషకు బుధవారం కమిషనర్ నడిపేన రామారావు వివరించారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం పరిధిని ప్రణాళికా బద్ధంగా రాబోయే 20 సంవత్సరములలో అభివృద్ధి చేయుటలో భాగంగా ఈ మాస్టర్ ప్లాన్ ను రూపొందించడం జరిగిందని చెప్పారు. ఈ పురపాలక సంఘములో గల 25 రెవెన్యూ గ్రామాలు, పురపాలక సంఘమునకు బయట ఉన్న 21 రెవెన్యూ గ్రామాలను కలుపుతూ పారిశ్రామిక, వ్యాపార, నివాస ప్రాంతాలుగా వర్గీకరిస్తూ జాతీయ రహదారిని కలుపుకొని జోన్ల వారీగా విభజించడం జరిగిందని కమిషనర్ నడిపేన రామారావు తెలియజేశారు. ఈ జంట పట్టణాలను ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి చేయుటకు వీలుగా 30,40,60,80 మరియు 100 అడుగులు ప్రతిపాదిత రహదారులతో ఈ మాస్టర్ ప్లాన్ తయారు బడినదని కమిషనర్ శాసన సభ్యులకి వివరించారు. ఈ మాస్టర్ ప్లాన్ కి సంబంధించి నేడు డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేయబడుతుందని ఈ మాస్టర్ ప్లాన్ పై ప్రజలు ఏమైనా అభ్యంతరాలు, సలహాలు, సూచనలు ఉంటే 30 రోజుల లోగా ఈ కార్యాలయమునకు వ్రాతపూర్వకముగా తెలియజేయవలసిందిగా కమిషనర్ కోరారు.

## విధి నిర్వహణలో బదిలీలు సర్వసాధారణం

**పలాస, జులై 16(వార్త):** విధి నిర్వహణలో బదిలీలు సర్వసాధారణమని పలాస డివిజన్ ఉపవిద్యాశాఖాధి పి.విలియం అన్నారు. పలాసలో బుధవారం పి.రవికుమార్ ప్రధానోపాధ్యాయులు అధ్యక్షతన జరిగిన వీడ్కోలు సమావేశం లో ఈ పాఠశాలలో 8ఏళ్ళు పనిచేసి వివిధ పాఠశాలలకు బదిలీపై వెళ్లిన 18మంది ఉపాధ్యాయులకు సన్మానం చేయడం జరిగింది. ఈకార్యక్రమంలోముఖ్యతిదిగా , ఈ పాఠశాల నుండి వివిధ పాఠశాలలకు బదిలీ పై వెళ్లిన ఉపాధ్యాయులు టి.చిట్టీబాబు, సంయుక్త రాణి పట్నాయక్, కె.మాధవరావు, కె.జోగారావు, టి.రఘురామక్రిష్ణ, యస్.భగీరధి, కె.సాయిబాబ, జె.షన్మఖరావు, టి.శ్రీనివాసరావు, యమ్.సుమలత, పి.నాగేశ్వరరావు, ఎల్.సూర్యరావు, ఎన్.రామ్ ప్రసాద్, యస్.శాంతి, కె.మోహనరావు, పి.వనిత, మహమ్మద్ జావిద్ ఇక్బాల్ లను సన్మానం చేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ తారక్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.







# హామీలతో ప్రజలను మోసం చేసిన చంద్రబాబు

**-అప్పుల ఊబిలో ఆంధ్ర రాష్ట్రం**

**-ప్రశ్నించిన గొంతులను నొక్కుతున్నారు**

**-ప్రభుత్వ తీరుపై మాజీమంత్రి అప్పలరాజు ధ్వజం**

**మందస, జులై 16(వార్త):** హామీలతో ప్రజలను అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రజలను మోసం చేశారని మాజీమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ధ్వజ మెత్తారు. మందసలో జరిగిన వైకాపా విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమంలో అప్పలరాజు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడుతుందని ప్రజలకు వంచన చేస్తూ రాష్ట్రాన్ని అప్పుల ఊపులోకి దించిందన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా హామీలను కూటమి ప్రభుత్వం గాలిలో కలిపిందని, సీఎం చంద్రబాబు హామీలతో అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వ పాలనలో అవినీతి తాండవిస్తుందని, భూకబ్జాలు పెరిగిపోయాయన్నారు. ప్రభుత్వ నిరంకుశ పాలనను వ్యతిరేకిస్తున్న వారిని తప్పుడు కేసులను బనయిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఎక్కడికక్కడ భూ కబ్జాలు దోపిడీ దౌర్జన్యాలు పెరిగిపోయాయని, ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజల హక్కులను హరిస్తూ నిరంకుశంగా పాలన సాగించి అణచివేత చర్యలను కొనసాగిస్తుందని అన్నారు. సూపర్ సెక్స్ పథకాలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని ఉచిత వంట గ్యాస్ తల్లికి వందనం పథకం లబ్ధిదారులకు డబ్బులు సక్రమంగా చెల్లించకుండా మోసం చేసిందని అన్నారు. ఫీజు రీఎంబర్స్మెంట్ పథకం కింద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందవ్వకుండా హామీలతో కాలం గడుపుతోందని దీంతో పేద విద్యార్థులు ఉచిత విద్యకు దూరమవుతున్నారని ఆరోగ్యశ్రీ పథకం ప్రభుత్వం నిర్వీర్యం చేసి పేదలకు ఉచిత వైద్యం దక్కకుండా రకరకాల నిబంధనలు విధిస్తుందని అన్నారు. రాష్ట్రంలో ప్రతినెల విద్యుత్ చార్జీలు ఇష్ట రాజ్యాంగ పెంచి ప్రజలను వ్యాపార వర్గాలను కూటమి సర్కార్ మోసం చేసిందని విద్యుత్ చార్జీలు పెరగడంతో సామాన్య ప్రజలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న దగా పాలనకు ప్రజలు ఎండగట్టాలని కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులను నిలదీయాలని ఆయన పిలుపునిచ్చారు. వైసిపి కార్యకర్తలు అభిమానులు గ్రామాల్లో వైసిపి పార్టీ పటిష్టత కోసం కృషి చేయాలని ప్రజా సమస్యలపై నిరంతరం పనిచేయాలని ఆయన కోరారు. సమావేశంలో మందస ఎంపీపీ డొక్కరి దానయ్య, జడ్పీటీసీ సవర చంద్రమ్మ, పార్టీ మందస మండల అధ్యక్షుడు దల్లి జానకి రావు,ముఖ్య నాయకులు సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# రైతాంగ సమస్యలు పరిష్కరించాలి



**మందస, జులై 16(వార్త):** జిల్లాలో సుమారుగా 65 వేల హెక్టార్లలో జీడిపంట సాగు చేస్తున్నారని, ఈ పంటపై ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని జీడి పంటకు రైతాంగ సమస్యల సాధన కమిటీ నాయకులు అన్నారు. ఎంఎల్ఏ గా గౌతు శిరీషా రైతాంగ సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, సరైన గిట్టుబాటు ధర కల్పించాలన్న ప్రధాన డిమాండ్ తో గత 3 దశాబ్దాలుగా అనేక ఉద్యమాలు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి ఫలితం లభించలేదన్నారు. గత వైసీపీ ప్రభుత్వం జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తామని వాగ్దానం చేసినప్పటికీ, ఎటువంటి కార్యాచరణకు పూనుకోలేదని, మీ దృష్టికి కూడా అనేకసార్లు తీసుకురావడం జరిగిందన్నారు. శాసనసభ్యురాలుగా గౌతు శిరీష శాసనసభలో రైతులకు సరైన గిట్టుబాటు ధర కల్పించాలని ప్రస్తావించి ఉన్నారని, ప్రత్యేకంగా దృష్టి పెట్టి రైతులకు సరైన న్యాయం చేస్తారని వారు కోరారు. రైతుల చిరకాల వాంఛ అయినటువంటి వంశధార కాలువ పలాస మండలం బొడ్డపాడు గ్రామ యాపొడు చెరువుకు అనుసంధానం చేస్తూ ఇచ్ఛాపురం వరకు పొడిగించాలని, ఎంతో కాలంగా రైతులని వేధిస్తున్న సాగునీటి సమస్యలను పరిష్కరించాలని మహేంద్ర రైతు సంఘం నాయకులు ఎంఎల్ఏ గౌతు శిరీషాను కోరారు. మందస మండలంలోని అన్ని గైర్లు పూర్తిగా పాడై పోయాయి. దీంతో పంట పొలాలకు నీటి సరఫరా జరుగక పోవడంతో పంటలు పండించుటకు రైతులు చాలా అవస్థలు పడుతున్నారన్నారు. కళింగదళ్, డబారుసింగి రిజర్వాయర్ల మదుములు పాడైనందున మదుములు రిపేరు చేయాలని, దామోదర్ సాగర్ కుడికాలువ, బెల్లుపటియాదోని, చిక్కిడిగాం జంపరగాయి సమస్యలు పరిష్కరించాలన్నారు. డిమిరియా నుండి కొత్తపల్లి వరకు దేశిబట్టిలో గల పూడికను తొలగించాలని, కొర్రాయి గేటు నుండి జెన్నాచెరువు వరకు ఉన్న కాలువలో ఉన్న గుర్రపు డెక్కను తొలగించాలని కోరారు. అన్ని చెరువులు, కాలువలలో ఉన్న పూడికను పూడికను తొలగించాలన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద రైతులకు ఉపయోగ పడే పనులు చేయించాలని, మండలంలో రైతు పొలం ఎక్కడ ఉన్నా ఉపాధి హామీ పథకం వర్తించేటట్లు చేయించాలి. కార్యక్రమంలో రైతాంగ సమస్యల సాధన కమిటీ నాయకులు మామిడి మాధవరావు, బెస్త కామేశ్వరరావు ఉన్నారు.

# పలు కుటుంబాలను పరామర్శించిన సిరిపురం



**ఎల్ ఎన్ పేట / హిరమండలం, జులై 16(వార్త):** ఎల్ ఎన్ పేట మండలం, శ్యామలాపురం గ్రామానికి చెందిన ఇప్పిలి జగదీశ్వరరావు ఇటీవల పాము కాటుతో మరణించారు. ఆయన కుటుంబాన్ని జిల్లా బీజేపీ అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు మంగళవారం పరామర్శించి జగదీశ్వరరావు తో తనకున్న సంబంధాన్ని గుర్తుకుచేసుకుని కుటుంబాన్ని ఓదార్చారు, అలాగే హిరమండలం మండలం, చొర్లంగి గ్రామం, రుగడ గ్రామాల్లో పలు కుటుంబాల్ని పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనతో పాటు ఎల్ ఎన్ పేట మండల బిజెపి అధ్యక్షులు వాన వెంకటరమణ, ఉపాధ్యక్షులు జి సోమేశ్వరరావు, బీజేపీ నాయకులు మహంతి రవి, భూపతి, పడాల షణ్ముఖరావు,దారపు గోవింద, హేమ సుందర్, జాన్, సంతోష్ తదితరులు ఉన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## 18న ముంజూరు కళింగాంధ్ర కవితా వార్షిక ఆవిష్కరణ

**మందస, జులై 16(వార్త):** మందస మండలంలోని హరిపురంలో ఈ నెల 18న సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు కార్యదర్శి లబ్బ రుద్రయ్య, సిక్కోలు బుక్స్ దుప్పల రవికుమార్ తెలిపారు. ముంజూరు కళింగాంధ్ర కవితా వార్షిక 2024 ఆవిష్కరణ జరుగుతుందని, హరిపురంలో గల శాతావాహన డిగ్రీ కళాశాలలో మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఆహ్వానాన్ని దున్న రామారావు పలుకుతారని, సభాధ్యక్షునిగా మామిడి కృష్ణారావు, ముఖ్య అతిథిగా సీనియర్ జర్నలిస్ట్, తూరుపు తీరం సంపాదకులు, చరిత్రకారులు నల్లి ధర్మారావు హాజరవుతారన్నారు. అదేవిధంగా కింతలి కృష్ణమూర్తి చేతుల మీదుగా ఆవిష్కరణ జరుగుతుందని, తొలి ప్రతి స్వీకర్త డాక్టర్ కణితి కేశవరావు, విశిష్ట అతిథిగా డాక్టర్ కుమార్నాయక్, ప్రధాన అతిథిగా మల్లేన దేవరాజు, గౌరవ అతిథిగా దాసరి తాతారావు, ప్రియ అతిథిగా మజ్జి భాస్కరరావు హాజరవుతారని, పరిచయాన్ని కుత్తుం వినోద్ చేస్తారని, సమన్వయం రాపాక ధనరాజు, వందన సమర్పణ గొరకల లోకేశ్వరరావు చేస్తారన్నారు. సిక్కోలు గాయకులతో కళింగాంధ్ర గుండెఘోషపై ఆట-పాట-మాట కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

# ఎయిర్‌పోర్టు వస్తేనే పలాస అభివృద్ధి సాధ్యం

**- ఎమ్మెల్యే గౌతు శిరీష**



**పలాస, జులై 16(వార్త):** పలాస నియోజవర్గంలో కార్గో ఎయిర్ పోర్టు ఏర్పాటు జరడంతోనే పలాస ప్రాంతం అభివద్ధి సాదించగలదని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. టిడిపి కార్యాలయంలో కార్గో ఎయిర్పోర్టుపై బుధవారం ప్రజాభిప్రాయసేకరణ చేపట్టారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతంగా శ్రీకాకుళం జిల్లా అభివద్ధి చెందాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహనాయుడు, మంత్రి అచ్చెనాయుడు ఆలోచన విదానం వల్లే నేడు బావనపాడు పోర్టు నిర్మాణం శరవేగంగా జరుగుతుందని, ఆ దశలోనే పలాసలో ఎయిరోపోర్టు ఏర్పాటు చేయడం వల్ల ఎంతో అభివద్ధి చెందుతుందన్నారు. అంతేకాకుండా మీ పిల్లలకు ఉద్యోగాలు, మీ భూములకు విలువ పెరగడం జరుగుతుందన్నారు. ఎవరో నలుగురైదుగురు మూరు?లు మాట్లాడినంత మాత్రాన ఎయిర్ పోర్టు నిర్మాణం నిలిచిపోయే పరిస్థితి లేదన్నారు. భూములు కోల్పొయి వారికి నష్టపరిహారంతో పాటు వారి పిల్లలకు ఉద్యోగాలుతో పాటు మరి ఏమి కావాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను మనం కోరుతూ మందుకు వెళదామన్నారు. పలాసకు ఎయర్ పోర్టు వస్తే మనకే మేలు జరుగుతుందని ప్రతీ ఒక్కరూ గ్రహించాల న్నారు. తాను కూడా పలాస నియోజకవర్గాన్ని అభివద్ధి చేయాలనే నినాదంతోనే పనిచేస్తున్నానన్నారు. ఆర్డీఓ జి.వెంకటేష్ మాట్లాడుతూ కార్గో ఎయిర్పోర్టు కోసం 1200 ఎకరాలు సేకరిస్తున్నామని అందులో 200 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉండగా, మిగిలిన 1000 ఎకరాలు జారాయితీ భూముల నుంచి సేకరిస్తున్నామన్నారు. వజ్రపుకొత్తూరు, మందస మండలాల పరిధిలో ఉన్న మెట్టూరు, అనకాపల్లి, చీపురపల్లి గ్రామాలలో ఎక్కువ శాతం భూమి తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎక్కడ కూడా గ్రామాలకు ఇబ్బందులు లేకుండా భూములను సేకరిస్తున్నామన్నారు. ఎయిర్పోర్టుకు సంభందించి నిర్మాణానికి మూడు విడతలుగా భూపరీక్షలు చేయించాలస్సి ఉందని ప్రస్తుతం 25 కిలోమీటర్లు మేర ఎటువంటి కొండలు, విద్యుత్ లైన్లు లేకుండా పర్వే చేస్తున్నామన్నారు. రైతులు నష్టపరిహారం కింద కోటి రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేయగా, నష్టపరిహారం కోసం ప్రస్తుతం చర్చించడం లేదని, ప్రస్తుతం ఉన్న పరిస్థితులను ప్రభుత్వ దష్టికి తీసుకువెళ్లి నష్టపరిహారం తరువాత చర్చిస్తామన్నారు. గ్రామాలలో ఇతర వ్యక్తులు వచ్చి ఎవరైన తప్పుడు ప్రచారాలు చేస్తే వాటిని నమ్మవద్దని అన్నారు. రైతులకు అండగా ప్రభుత్వం ఉంటుందని ఎయిర్ పోర్టు నిర్మాణం వల్ల ఆయా ప్రాంతం అభివద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మందస, వజ్రపుకొత్తూరు, పలాస మండలాల తాహిసిల్దార్లు ఎం.శ్రీకాంత్, డి.సీతారామమూర్తి, టి.కళ్యాణచక్రవర్తి, పలాస టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త యార్లగెడ్డ వెంకన్నచౌదరి, వజ్జ బాబురావు, టిడిపి నాయకులు వితల్, దువ్వాడ హేమబాబు చౌదరి, సూరాడ మోహనరావు, బావన దుర్యోదన , రట్టి లింగరాజు, బి.కర్రయ్య, రోడ్లు కామేశ్వరరావు పాల్గొన్నారు.

## రైల్వే గేటు మూసివేతతో ఇక్కట్లు



**ఇచ్ఛాపురం, జులై 16(వార్త):** రత్తకన్న ఎల్ సి గేటు మూసివేత తో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ముందస్తు సమాచారం లేకుండా ట్రాక్ మరమ్మతులు పేరుతో బుధవారం సాయంత్రం 3 నుండి 8 వరకు పనులు చేపట్టారు.ఇదే విషయాన్ని గేటు వద్ద సిబ్బంది బోర్డు తో తెలియజేసారు.ఈ విషయం సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో తెలిసింది.ఈ రహదారి పై ప్రత్యామ్నాయ మార్గం లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. స్కూల్ లు ,కాలేజీలు సినిమా హాల్ లు ఇటుక బట్టిలు సుమారు 20 గ్రామాలు ఉన్నాయి.

## కొత్తూరులో ఉచిత నేత్ర చికిత్స శిబిరం

**కొత్తూరు, జులై 16(వార్త):** కొత్తూరు మండలంలో రెడ్‌క్రాస్ మండల కన్వీనర్ పొగిరి రవి ఆధ్వర్యంలో విజయనగరం పుష్పగిరి కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సమితి సహకారంతో ఉచిత నేత్ర చికిత్స శిబిరాన్ని స్థానిక శ్రీ వెంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. నేత్ర వైద్యాధికారి యిప్పిలి జానకిరామయ్య 125 మందికి కంటిపరీక్షలు నిర్వహించారు. వీరిలో 43 మందికి కంటి ఆపరేషన్ అవసరమని నిర్ధారించి, వారికి విజయనగరం కంటి ఆసుపత్రికి తరలించారు. ఆపరేషన్, భోజనం, మందులు, ప్రయాణ సౌకర్యం లాంటి అన్ని సదుపాయాలు పూర్తిగా ఉచితంగా కల్పించారు. ఈ శిబిరంలో క్యాంపు కోర్డినేటర్ హరిబాబు, ఆలయ గుమస్తా బోగి వెంకటరమణ, పలువురు స్థానికులు పాల్గొన్నారు.



# ఈవ్ టీజింగ్, డ్రగ్స్, సైబర్ క్రైమ్‌పై అప్రమత్తం

**మందస, జులై 16(వార్త):** సమాజంలో మహిళాలు ఎంతో అప్రమత్తంగా ఉండాలని కాశీబుగ్గరూరల్ సీఐ పి.తిరుపతిరావు అన్నారు. మందస పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మందస పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నారీ శక్తి, సంకల్పం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీఐ తిరుపతిరావు మాట్లాడుతూ విద్యార్థినులకు మహిళ భద్రతపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. మహిళ భద్రత, శక్తి యాప్ ఆవశ్యకత,ప్రయోజనం గూర్చి వివరించారు. మహిళలపై సామాజిక మాధ్యమాల ద్వారా జరుగుతున్న వేధింపులు, సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళా చట్టాలు, బాల్య వివాహాల నియంత్రణపై అవగాహన కల్పించారు.

కార్యక్రమంలో ఇన్ చార్జ్ ప్రిన్సిపాల్ బాడ వెంకట మోహన్, బబుల్ సాహు, గురుగుబెల్లి రమణమూర్తి, ఎల్.సోమేశ్వర రావు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.







## నారీశక్తిపై అవగాహన

**ఇచ్ఛాపురం, జులై 16(వార్త):** నారీ శక్తి పై మండపల్లి లో ప్రజలు కు అవగాహన కల్పించారు. సంబంధిత పోస్టర్ ను ఎమ్మెల్యే బెందాలం అశోక్ ప్రారంభించారు. సైబర్ నేరాలు, మహిళా రక్షణ, బాల్య వివాహాలు, 112 టోల్ ఫ్రీ నెంబర్ పై రూరల్ ఎస్ ఐ ఈ శ్రీనివాసరావు అవగాహన కల్పించారు.ధర్మపురం ఉన్నత పాఠశాలలో కూడా విద్యార్థులు కు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎం ఈ ఓ ఎస్ విశ్వనాథం పాల్గొన్నారు.

## అలరించిన కచేరీ



**ఇచ్ఛాపురం, జులై 16(వార్త):** కర్కాటక సంక్రమణం సందర్భంగా గ్రామ దేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో ఘనంగా పూజలు నిర్వహించారు. ఆశి కృష్ణ రెడ్డి, శిష్యులు నిర్వహించిన సంగీత కళాకారులు గాత్ర కచేరీ అందరినీ అలరించింది.

## డెప్యూటీ ఎంపీడీఓగా వెంకట రావు



**ఇచ్ఛాపురం, జులై 16(వార్త):** మండల డెప్యూటీ ఎంపీడీఓ గా ఎల్. వెంకటరావు నియమితులయ్యారు. ఈ మేరకు సిబ్బంది అభినందించారు. అనంతరం పి 4 పై మండల ప్రత్యేక అధికారి భవానీ శంకర్, ఎంపీడీఓ రామారావు లు సమీక్ష సమావేశం నిర్వహించారు.

## రేపు విద్యుత్ అంతరాయం

**పలాస, జులై 16(వార్త):**త శుక్ర వారం 132/33 కేవి పలాస సబ్ స్టేషన్ లో విద్యుత్ నిర్వహణ పనులు చేపడుతున్న కారణం గా ఉదయం 08:00 నుండి మధ్యహ్నం 03:00 వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని పలాస డివిజన్ , విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి యజ్ఞేశ్వర రావు ఒక ప్రకటనలో తెలిపారు. పలాస మండలం లో గల గ్రామాలలో అనగా కాశీబుగ్గ టౌన్ ,పలాస టౌన్ కె టి రోడ్ నుండి మోగిలిపాడు వరకు హరిశంకర్ థియేటర్ నుండి రెంటికోట వరకు , ఆర్టీసీ కంప్లెక్స్ నుండి లక్ష్మీపురం టోల్ గేట్ వరకు గాంధీనగర్,హరిజన వీధి, బ్రాహ్మణ వీధి ,ఇండస్ట్రియల్ ఏరియా ,అనంతపురం, పాత జాతీయ రోడ్డు 5,శ్రీనివాసనగర్, ఎండివో ఆఫీస్ ,సుధికొండ, రోటరీ నగర్ రామకృష్ణాపం ఆర్ %డ%ఆర్ కాలనీలో , కోసంగి పురం ,నెమలి, నెమలి నారాయణపురం తదితర పరిసరాలకు తదితర విద్యుత్ నిలుపుదల చేయబడును కావున విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగును అని ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు అంత కలిసి సహకరించాలని ఒక ప్రకటనలో తెలిపారు.

## క్రీడలను అభివృద్ధి చేయాలి

**ఇచ్ఛాపురం, జులై 16(వార్త):** ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు, ఈ సమావేశంలో నియోజకవర్గ స్పోర్ట్స్ ఇంచార్జ్ కె పద్మనాభం రెడ్డి, మండల స్పోర్ట్స్ ఆర్గనైజర్ పి. కృష్ణ మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. పాఠశాలలో ప్రతి విద్యార్థి వ్యాయామము, క్రీడలలో పాల్గొనేలా చూడాలని. ప్రతి విద్యార్థి శారీరక మానసికంగా అభివృద్ధి చేసేందుకు వ్యాయామ ఉపాధ్యాయులు కృషి చేయాలని చెప్పారు. సెప్టెంబర్ 1 నుంచి 6 తేదీ వరకు మండల స్థాయి, 8 నుండి 15 వరకు డివిజనల్ స్థాయి, 15 నుండి 20 తేదీ వరకు జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు నిర్వహించడానికి అవసరమైన కార్యచరణ గురించి చర్చించారు. ఈ పోటీలకు పాఠశాల నుండి విద్యార్థులు పాల్గొనేలా సిద్ధం చేయాలని సూచించారు.




Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546